క్లుప్తంగా

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం వసంతలక్ష్మి కోరారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జియ్యమ్మవలస: మండలంలోని గౌరీపురం ఎంపీపీ పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన శంబంగి సత్యనారాయణ అనే వ్యక్తి శుక్రవారం ఆర్థికసాయం చేశారు. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున మొత్తం రూ.600 అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రుచి, శుచి కలిగిన ఆహారం అందివ్వాలని, ఆరోగ్య బాగాలేని విద్యార్థులను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చూడాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని సిబ్బందిని కోరారు.

వరి విత్తనాల కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో పలువురు రైతులకు వరి విత్తనాల మినీ కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఆర్‌జీఎల్ 7034, 7039, 7045, ఎస్ఎల్ఆర్ 3648, ఎంటీయూ 1426 రకాల విత్తనాలు అందజేసినట్లు వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.అనంత విహారి తెలిపారు.

సమావేశానికి తరలిరండి

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని రాయల్ కన్వెన్షన్‌లో శనివారం జరిగే వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తదితరులు పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి..

భామిని: మండలంలోని నల్లరాయిగూడ ప్రభుత్వ గిరిజన పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పాఠశాలలో సుమారు 126 మంది విద్యార్థులున్నప్పటికీ, ఒక్క టీచర్‌తోనే కాలక్షేపం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

పరామర్శ



గంగునాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పరజపాడు గ్రామానికి చెందిన శెట్టి గంగునాయుడు కుమారుడు శెట్టి వెంకటనాయుడు, రావాడకు చెందిన తాటిపల్లి గణేష్, దొంబిది బాబూరావులు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆయా గ్రామాలకు వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు చనిపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ధైర్యంగా ఉండాలని అన్నారు.
ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, మరడాన కిశోర్, లోలుగు నారాయణరావు, ఉషారాణి, రవణమ్మ, ఆదినారాయణ, బలగ వెంకటరమణ, శెట్టి తాతబాబునాయుడు, తాడేల మన్మధరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

జియ్యమ్మవలస రూరల్: గంజాయి, ఖైనీ, గుట్కా, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జియ్యమ్మవలస ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ యువతకు సూచించారు. మండల పరిధిలోని బొమ్మిక, బీజేపురం ప్రాంతాల్లో రోడ్డు భద్రతా నియమాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని కోరారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎంపీపీ ఆదినారాయణ



సీతంపేట: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ బి.ఆదినారాయణ అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు ఆరిక కళావతి, హెచ్.అదిలక్ష్మి, విజయకుమారి, ఎంపీటీసీ సభ్యులు హరిప్రసాద్, ఎస్.చంద్రశేఖర్, గణేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్. మోహనరావు, నియోజకవర్గ కన్వీనర్ ఎస్.కాంతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.సాయికుమార్, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రం సహా ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ట్రైబల్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ తదితరులు సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య సాధనకు సీతారామరాజు బ్రిటిష్ వారితో పోరాడిన తీరును కొనియాడారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులంతా మన్యం వీరుడు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్రోద్యమంలో అల్లూరి సీతారామరాజు పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు చేపట్టారు. ఈ పోటీల్లో వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

కొమరాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్ వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులంతా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత స్వాతంత్ర్య సాధనలో సీతారామరాజు పాత్రను వక్తలు కొనియాడారు. 24 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకు వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని ప్రశంసించారు.

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి జట్టు ట్రస్టు, నాగూరులలో అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం నిర్వహించారు. బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు అల్లూరి పోరాటాన్ని వక్తలు వివరించారు. అంతకుముందు సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు, వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు మేనేజర్ ప్రహరాజ్, కో–ఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ట్రైబల్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విజేతలకు బహుమతులు అందజేస్తున్న యస్ సొసైటీ కార్యదర్శి గౌస్, పాఠశాల సిబ్బంది



కొమరాడ: అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు



నాగూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

రాకపోకలకు తప్పని ఇక్కట్లు

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం కూడలి మీదుగా మైదాన ప్రాంత గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా రూపు కోల్పోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారవడంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా డోలమడ కూడలి వయా బర్న, సీతంపేట కూడలి, వంతవాడ, జి.వెంకటాపురం గ్రామాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. అధికారులు, పాలకులు స్పందించి రహదారి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వాన రహదారిని చూపిస్తున్న ప్రజలు

సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న పోరాటాలకు అన్ని వర్గాల మద్దతు కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రవణారావు కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘ నాయకులు కాద రాము, యడ్ల శ్రీనివాసరావు, వై.సింహాచలం, చల్ల స్వామినాయుడు, ఎం.వెంకటరమణ, గోవిందరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టును వినియోగించుకోండి

గుమ్మలక్ష్మీపురం: వర్మీకంపోస్టును వినియోగించుకోవాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు కోరారు. మండలంలోని లుంబేసు గ్రామ పంచాయతీలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కేంద్రం వద్ద 600 కేజీల వర్మీకంపోస్టు అందుబాటులో ఉందని, రైతులంతా ఈ ఎరువును వినియోగించుకోవాలన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సదుపాయాలను పరిశీలించాలని, నిర్దేశించిన సమయానికి తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జియ్యమ్మవలస: కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ధర్మారావు కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణను ఆయన శుక్రవారం పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 49 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తుండగా, 23 మంది మాత్రమే శుక్రవారం శిక్షణకు హాజరుకావడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలన్నారు.



శిక్షణలో పాల్గొన్న మహిళలు

రోడ్డు బాగుచేయండి

వీరఘట్టం: మురికికూపాన్ని తలపించేలా ఉన్న వీరఘట్టం మేజర్ పంచాయతీలోని బార్నాలవీధి రోడ్డును బాగుచేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చలివేంద్రి నుంచి వీరఘట్టం సాయిరాం మందిరం వరకు రోడ్డును బాగుచేసిన అధికారులకు ఈ రోడ్డు కనిపించకపోవడంపై విచారకరమన్నారు. రోజూ వేలామంది ప్రయాణాలు చేసి ఈ రోడ్డును వెంటనే బాగుచేయాలని డిమాండ్ చేశారు.



వీరఘట్టం బార్నాలవీధి రోడ్డు వద్ద నిరసన తెలియజేస్తున్న స్థానికులు

8న ధర్నా

వీరఘట్టం: ఇళ్ల స్థలాల కోసం పట్నంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలాలు ఇస్తామని ప్రస్తుత కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న భూ సమస్యలపై పాలకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సంత – నర్సిపురంలో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. గతంలో సంత – నర్సిపురంలో 151 మంది పేదలకు ఇచ్చిన స్థలాలను చూపించాలని కోరారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అప్పలనాయుడు

రూ. 50 వేల వితరణ

పాలకొండ రూరల్: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల రక్షణ గోడ ఇటీవల కూలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రహరీ నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ పల్లా కొండలరావు రూ.50 వేలు అందించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పాఠశాలను సందర్శించి పనులపై ఆరా తీశారు.

పీఏసీఎస్ అధ్యక్షుల ఎంపిక

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా రెడ్డి బలరాంస్వామి, బీజేపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి సోములను ఎంపిక చేసినట్లు కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు వారికి పలువురు అభినందనలు తెలిపారు.

13న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఎన్నికలు

గరుగుబిల్లి: పంచాయతీరాజ్(పీఆర్) మినిస్టీరియల్ ఉద్యోగుల ఎన్నికలు ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రతినిధి ఎస్.అర్జునరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఉదయం 9 గంటలకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాల పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులంతా విధిగా ఈ ఎన్నికలో పాల్గొనాలని కోరారు.

సన్మానం



నాగార్జున మాస్టారును సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని వనిజ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీ అవుతున్న బి.నాగార్జునను పాఠశాల సిబ్బంది శుక్రవారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులంతా నాగార్జున మాస్టారును సత్కరించి, ఆయన సేవలను ప్రశంసించారు.

నేడు లోక్ అదాలత్

పాలకొండ రూరల్: రాజీయే రాజ మార్గమని కక్షిదారులు గుర్తించాలని పాలకొండ న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి చందక హరిప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం లోక్ అదాలత్ నిర్వహిచనున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

ఎరువులు సరఫరా చేయాలి

గరుగుబిల్లి: తమకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరురావుపల్లి, బీవీపురం తదితర గ్రామాల్లోని రైతులు ఇప్పటికే వరి వెదలు జల్లడంతో పాటు నారుమడులు తయారు చేశారు. ఈ నేపథ్యంలో తదుపరి వ్యవసాయ పనులకు అవసరం మేర యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పార్టీ శ్రేణులను కోరారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన తోయక గోపాల్‌ను పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ కార్యదర్శిగా..నిమ్మల నాగేశ్వరరావును పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, కడ్రక వెంకటరావును పార్టీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా, పత్తిక తిరుపతిరావును పార్టీ మండల ఎస్టీ సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వెలువడగా, ఈ మేరకు వారంతా చినమేరంగిలో మాజీ డిప్యూటీ సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం చెప్పిన ప్రకారం పనిచేస్తామని, మళ్లీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికీ మంచి గుర్తింపు ఉంటుందని, ప్రజలంతా మన పార్టీ వైపే ఉన్నారన్నారు. కూటమి మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ చైతన్యవంతం చేయాలన్నారు.



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణిని కలిసి కృతజ్ఞతలు చెబుతున్న పార్టీ నాయకులు

నేడు మారు రథయాత్ర

వీరఘట్టం: గత నెల 27వ తేదీ నుంచి వీరఘట్టం మండల కేంద్రంలో జరుగుతున్న జగన్నాథ రథయాత్ర మహోత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. శనివారం మారు రథయాత్రలో ఉత్సవాలు ముగియనున్నాయి. రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకుడు లింగరాజ్‌రథో కోరారు. ఉదేరుతారని అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

కల్కి అవతారంలో జగన్నాథుడు

పాలకొండ/భామిని: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి శుక్రవారం భక్తులకు కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. పాలకొండలో మారు రథయాత్ర నిర్వహించనున్నట్లు అర్చకుడు విశ్వనాథదాస్ తెలిపారు. బత్తిలిలో అర్చకుడు ప్రతాప్ చంద్ర సాహూ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

రామావతారంలో జగన్నాథుడు

జియ్యమ్మవలస: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చినమేరంగి గ్రామంలో కొలువైన జగన్నాథస్వామిని శుక్రవారం రామావతారంలో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శనివారం మారు రథయాత్ర జరుగుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు యాత్ర ప్రారంభం కానుందని ఆలయ పూజారి గిరిధర పాత్రో తెలిపారు.



పాలకొండ: కల్కి అవతారంలో జగన్నాథస్వామి



ప్రత్యేకాలంకరణలో జగన్నాథుడు

కూటమి నాయకులను నిలదీయండి..

భామిని: బోగస్ హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న కూటమి పాలనను నిలదీయడానికి అందరూ సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నదిమిలిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్వతీరం మన్యం జిల్లా కేంద్రంలో శనివారం జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి కార్యకర్తలు విధిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పత్తిక సింహాచలం, కలిశెట్టి మన్మధరావు, బిడ్డిక సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నదిమిలిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, ధర్మారావు

9న దేశవ్యాప్త సమ్మె

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. కురుపాం మండల కేంద్రంలో పలువురు కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు.

రాజ్యాంగం కల్పించిన చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. కార్మిక హక్కులు హరించేలా కేంద్రం ప్రయత్నం చేస్తోందని, మనమంతా దానికి ఖండించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతిఒక్కరూ సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, సివిల్ సప్లయి హమాలీలు పాపమ్మ, జానకి, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు జీవన్న, సూరయ్య తదితరులు

చురుగ్గా పూడికతీత పనులు

సీతంపేట: మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ ఆరిక కళావతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం చేపట్టిన పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తడి, పొడి చెత్తను అంబాసిడర్లకు అప్పగించాలన్నారున. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులంతా ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై, తమ హక్కులపై గళం విప్పారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 6 గంటలకే పంచాయతీలకు హాజరుకావాలని పంచాయతీరాజ్ కమిషనర్ మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఉదయాన్నే విధులకు హాజరుకావాలని చెప్పడం వల్ల మహిళా సిబ్బంది, వృద్ధాప్యంలో ఉన్న సిబ్బంది ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ఆధారంగా పంచాయతీ కార్యదర్శుల పనితీరును బేరీజు వేయడం సరికాదన్నారు. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకుంటే ఈ నెల 9న పెన్‌డౌన్ చేసి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.అప్పారావు, టి.భాస్కరరావు, ఎం.భార్గవ్, పి.వెంకటరమణ, ఎస్.రవికుమార్, బి.వైకుంఠరావు, ఎ.లలితకుమారి, పి.శిరీష, ఎస్.సంధ్య పాల్గొన్నారు. –గరుగుబిల్లి

జీసీసీ డిపో తనిఖీ

భామిని: మండల కేంద్రంలోని జీసీసీ డిపోను సీఎస్ డీటీ రమేష్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు వివరాలపై ఆరా తీశారు. కార్డుదారులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న డీటీ రమేష్‌కుమార్, వీఆర్ఓ గిరిబాబు

భవన నిర్మాణానికి చర్యలు చేపడతాం..

పాలకొండ రూరల్: ఐదు మండలాలకు సేవలు అందిస్తున్న పాలకొండ అగ్నిమాపక కేంద్రం పూర్తిగా అవసాన దశకు చేరుకుంది. ఏ క్షణమైనా భవనం కూలిపోయే అవకాశం ఉండడంతో ఇటీవల సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం ఈ కేంద్రాన్ని సందర్శించారు. భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘ నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. ఈయన వెంట జనసేన, టీడీపీ నాయకులు, అగ్ని మాపక అధికారి జామి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.